సాక్షి అనకాపల్లి

ఆదివారం । 12 । మే । 2024



కేజీహెచ్‌ను తలదన్నేలా...

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు భీమబోయినపాలెం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. 8లో



భూమికి భద్రత.. యజమానికి భరోసా 10లో

గరిష్ఠం/కనిష్ఠం 36.0/23.8

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు

సర్వం సిద్ధం



మీడియా సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. మరో 24 గంటల వ్యవధిలో పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి జిల్లాలో ఎన్నికలకు ముందస్తు చర్యలు ఏవిధంగా చేపట్టారో వివరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు, 12,89,371 మంది ఓటర్లు
- 340 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- ఎన్నికల విధులకు 10,536 మంది సిబ్బంది
- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలు, కీలకమైన ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు సీల్‌ను, సీసీ టీవీ ఫుటేజీలను తనిఖీ చేశాం. పోలింగ్ కేంద్రాల్లో, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, మంచి నీరు, టాయిలెట్ల సౌకర్యాలను ఏర్పాటు చేశాం. అసెంబ్లీ స్థాయి మానిటరింగ్ టీంలు, వీడియో వీవింగ్, వీడియో సర్వైలెన్స్, స్టేటస్ సర్వైలెన్స్, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీం, సెక్టోరల్ అధికారులను నియమించి వారితో సమీక్ష సమావేశాలు నిర్వహించాం. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ముందస్తు చర్యలు తీసుకున్నాం. క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించాం. 12, 13 తేదీల్లో పత్రికా ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి చేశాం.

48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్..

జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలి. రానున్న 72 గంటల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం మొదలైనవి నిషిద్ధం. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి తెరపడింది. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం–126 ప్రకారం.. 48 గంటల ముందు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారాలు నిషిద్ధం. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయపార్టీల కార్యకర్తలు, ప్రచార కార్యకర్తలు, ఓటర్లు కాని వారు వెళ్లిపోవాల్సివుంటుంది. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సమాచారం అందితే వెంటనే తెలియజేయవచ్చు. విచారణ అనంతరం దోషులుగా నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పోలింగ్ బూత్‌ను కనుగొనడంలో, ఓటింగ్ ప్రక్రియను అర్థం చేసుకోవడంలో సహాయపడేందుకు బృందాలను నియమించాం. వృద్ధ, వికలాంగ ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పోలింగ్ స్టేషన్లో ర్యాంపులు, సహాయకులు, వీల్‌చెయిర్ సౌలభ్యాన్ని కల్పించాం. అర్హులైన ఓటర్లందరూ పోలింగ్ స్టేషన్ల వద్ద సురక్షితంగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణాన్ని కల్పించాం. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణకు గాను జిల్లా అంతటా పటిష్ట భద్రతా నిబంధనలు అమలులో ఉన్నాయి. సున్నితమైన ప్రాంతాల వద్ద వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశాం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్

జిల్లాలో మొత్తం 12,89,371 మంది ఓటర్లున్నారు. వీరిలో 6,27,321 మంది పురుషులు, 6,62,022 మంది మహిళలు కాగా 28 మంది థర్డ్ జండర్ ఓటర్లు. వీరి కోసం జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో 340 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు కాగా 1189 సాధారణ పోలింగ్ కేంద్రాలు. మొత్తం 10,536 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొంటారు. వీరిలో 1,759 మంది పీఓలు, 1743 మంది ఏపీఓలు, 7,036 మంది బూత్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు, రూట్, జోనల్, బూత్ లెవెల్, బూత్ హై లెవెల్ అధికారులు ఉన్నారు. వారితో పాటు 16 మంది నోడల్ అధికారులు, 24 మంది స్టాటిక్ చెక్‌పోస్టు ఆఫీసర్లు, 24 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆఫీసర్లు, 157 మంది సెక్టోరల్ అధికారులు (రిజర్వ్), 146 మంది సెక్టోరల్ పోలీస్ అధికారులు, 8 ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీంలు, 8 కమాండ్ కంట్రోల్ టీంలు విధుల్లో పాల్గొంటారు. 3,666 బ్యాలెట్ యూనిట్లు, 3,666 కమిషనింగ్ యూనిట్లు, 3,968 వీవీ ప్యాట్‌లు, 25 టీమ్‌లు, 101 బీయూ, 127 సీయూ, 139 వీవీ పాట్‌లు రిజర్వ్‌గా ఉపయోగిస్తాం. ఏసీపీలో 25 టీమ్‌లు, 55 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 6 వీడియో సర్వైలెన్స్, 54 స్టాటిక్ సర్వైలెన్స్, 7 వీడియో వీవింగ్ టీమ్‌లు, 7 అకౌంటింగ్ టీమ్‌లు, 7 అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ టీమ్‌లు. 157 సెక్టోరల్ అధికారులు, 145 రూట్ అధికారులు, 380 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించాం. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ అమలు చేస్తున్నాం.

కట్టుదిట్టమైన భద్రత చర్యలు

ఎస్పీ కె.వి మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కేంద్ర పోలీసు కంపెనీలు, జిల్లా పరిధిలో గల పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత కల్పించాం. పాతనేరస్తులు, పోలింగ్‌కు ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో చెక్ పోస్టులను మరింత పటిష్టం చేశాం. నేటి నుంచి 144 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. చెక్ పోస్టులను మరింత పటిష్టం చేశాం. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, కొన్ని కీలక కూడలిలో కూడా చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. మొత్తం 158 సెక్టార్లుగా విభజించి పోలీస్ అధికారులను కేటాయించి సెక్టోరల్ పోలీస్ అధికారులను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా ధ్వంసం వంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాం. చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలు, అక్రమ మద్యం రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. నిరంతర సీసీ కెమెరాల నిఘా.. ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.10 లక్షల మించి నగదు రవాణా చేయకూడదు.

ఆఖరి క్షణాల్లో ప్రచార హోరు



నర్సీపట్నంలో ప్రచార ర్యాలీకి భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు



రావికమతం మండలం దొండపూడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ



నక్కపల్లిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రచారపర్వంలో ఆఖరి రోజు శనివారం జిల్లా అంతటా హోరెత్తింది. ప్రధాన పార్టీలన్నీ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అన్ని నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు జరిపాయి. నర్సీపట్నంలో జరిగిన రోడ్ షోలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పెట్ల ఉమాశంకర గణేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కరణం ధర్మశ్రీ చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో, మలసాల భరత్ అనకాపల్లి టౌన్‌లో, ఈర్లె అనురాధ కె.కోటపాడు మండలంలో, కంబాల జోగులు నక్కపల్లి, కోటవురట్ల తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

– సాక్షి న్యూస్ నెట్‌వర్క్

తోటకూర గింజలతో తల్లీ బిడ్డల చిత్రం



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రోరైటర్ రవికుమార్ తోటకూర గింజలతో తల్లీ బిడ్డల చిత్రాన్ని రూపొందించాడు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా 624 తోటకూర గింజలను వినియోగించి ఈ చిత్రాన్ని తయారు చేశాడు. చిత్రం మధ్యలో అమ్మ గొప్పతనం కోసం సూక్ష్మ లిపిలో రాశాడు.



కె.కోటపాడు 50 పడకల ఆస్పత్రి

మాడుగులలో ప్రగతి కళకళ

నియోజకవర్గంలో గ్రామగ్రామాన అభివృద్ధి తాండవిస్తోంది. రహదారి సౌకర్యం, ఇంటింటికీ కుళాయిలు, అందరికీ ఇళ్లు, రూ.120 కోట్లతో జలాశయాల ఆధునికీకరణకు శ్రీకారం, ఐదేళ్లలో రూ.4,200 కోట్లతో కనీవినీ ఎరుగని సంక్షేమాభివృద్ధి మాడుగులను రోల్‌మోడల్‌గా నిలిపాయి. 8లో

పదవి ఏదైనా ప్రజలతోనే..

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, డిప్యూటీ సీఎం.. ఇలా పదవి ఏదైనా ప్రజలు.. సామాన్య కార్యకర్త ఎవరు ఫోన్ చేసినా స్వయంగా తానే సమాధానం ఇస్తారు బూడి ముత్యాలనాయుడు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా స్థిరంగా నిలబడే తత్వం ఆయనది. హంగు.. ఆర్భాటాలు లేకుండా తారువలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలు సావధానంగా వింటారు. తక్కువ వ్యవధిలోనే పరిష్కరించి.. మన్ననలందుకుంటారు.. ఇదీ బూడి వ్యవహార శైలి.



సాక్షి ఇంటర్వ్యూ

- నమ్ముకున్న సిద్ధాంతం.. ఇచ్చిన మాట కోసం ఎందాకైనా..
- సాక్షితో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : ఎందరో ఉండగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడినే వైఎస్సార్‌సీపీ ఎంపిక చేయడానికి కారణం.. ఆయన చిత్తశుద్ధి.. ప్రజలు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండే నైజం.. సమస్యలను సామరస్యంగా పరిష్కరించే సహనం వంటి సుగుణాలే. అసెంబ్లీ సమావేశాల సమయంలో తప్ప మిగిలిన సమయం అంతా తారువ క్యాంపు కార్యాలయంలోని వేప చెట్టు కిందే గడిపేస్తారు ఆయన. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాక్షి ఇంటర్వ్యూలో ఎంపీగా గెలిస్తే ఏం చేస్తారో ఆయన వివరించారు. అనేక విషయాలు పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

'గడప గడప'తో మంచి గుర్తింపు..

ప్రజా సమస్యలు కూలంకషంగా తెలుసుకోవడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించి మన్ననలు పొందాను. ఎమ్మెల్యేగా రెండుసార్లు పని చేసిన అనుభవంతో పాటు ప్రభుత్వం అందజేసే ప్రతి రూపాయి అభివృద్ధికి.. పేదల ఉన్నతికి ఖర్చు చేయడంతో పార్టీ నన్ను గుర్తించింది. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాపై పెద్ద బాధ్యత పెట్టారు. దాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తాను.

కొత్త జిల్లా అనే సమస్యను అధిగమిస్తా..

కొత్తగా ఏర్పడిన జిల్లా కావడం వలన నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం.. ఉద్యోగులు, అధికారులతో సమన్వయం వంటి కొన్ని ప్రాథమిక సమస్యలుంటాయి. వాటిని నేర్పుతో అధిగమిస్తాను. అనకాపల్లి సమస్యలు పార్లమెంటులో వినిపించి ఒక ప్రణాళిక ప్రకారం ఐదేళ్లలో మాడుగుల అభివృద్ధికి ఎలా కృషి చేశానో అలా కృషి చేస్తాను.

అందరినీ కలుపుకుని ముందుకెళ్తా..

అనకాపల్లి పార్లమెంట్‌లో ఏడు నియోజకవర్గాలున్నాయి. ప్రతి నెల నియోజకవర్గాల్లో పర్యటిస్తాను. అక్కడి నాయకులను కలుపుకుని అభివృద్ధికి కృషి చేస్తాను. నిధుల విడుదలకు ప్రయత్నిస్తాను. వర్గాలు లేకుండా అంతా ఒకే తాటిపైకి వచ్చేలా ముందుకెళ్తాను.

నూతన జిల్లా అభివృద్ధిపై దృష్టి సారిస్తాను..

కొత్త జిల్లా అభివృద్ధికి సర్వశక్తులు ఒడ్డుతాను. అసెంబ్లీ సమావేశాల సమయంలో అమరావతి, లేదంటే తారువ క్యాంపు కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేవాడిని. ఇకపై అనకాపల్లిలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటాను. ఢిల్లీ సమావేశాల సమయంలో అక్కడికి వెళ్తాను.

ప్రజల మధ్యే ఉంటా..

ఎంపీ అంటే ప్రజలతో పెద్దగా సంబంధాలు లేని పదవి అని చాలా మంది అనుకుంటారు. నిజమైన ప్రజా సేవకుడికి పదవులతో పనేం ఉంది? నేను గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన వాడిని. ఎప్పుడూ ప్రజల మధ్యే ఉన్నాను. ఇకపై కూడా ఉంటాను. ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పదవుల్లో ఉండి కూడా ప్రజలకు అందుబాటులోనే ఉన్నాను. నాదెప్పుడూ అదే ఒరవడి. గతంలో ఉన్నట్లే నా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటాను. అభివృద్ధికి.. సంక్షేమానికి కృషి చేస్తాను.

పారిశ్రామికంగా అనకాపల్లిని అభివృద్ధి చేస్తా..


నా ప్రాథమిక విద్య అంతా అనకాపల్లిలోనే జరిగింది. చిన్ననాటి నుండి అనకాపల్లిపై అవగాహన ఉంది. బెల్లం మార్కెట్‌కు అనకాపల్లి ప్రసిద్ధి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అనకాపల్లిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేస్తాను.

నేను లోకల్..

అనకాపల్లిలో నాన్‌లోకల్ అభ్యర్థులను ఓడించి పంపిస్తారు. అదిక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఎన్నికల తర్వాత ఎవరు అందుబాటులో ఉంటారు.. ఎవరుండరు అనే సంగతి ఇక్కడి ప్రజలు ఆలోచిస్తారు. ప్రస్తుతం నాన్ లోకల్ అభ్యర్థి ఇక్కడ పోటీ చేస్తుండటంతో అనకాపల్లి ప్రజలు లోకల్ అయిన నన్నే గెలిపిస్తారనే సంపూర్ణ నమ్మకం ఉంది. దీంతో పాటు సీఎం జగన్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం కూడా నా గెలుపును మరింత సులువు చేస్తాయని బలంగా నమ్ముతున్నాను.

నాడు చెప్పుతో కొట్టి..

నేడు 'కాపు' కాస్తానంటూ కాకమ్మ కబుర్లు!



- గంటా రాయబారంతో మెత్తబరిచేందుకు యత్నాలు
- తన సీటు కోసం మా ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు: అనితతోపాటు గంటాపైనా రగిలిపోతున్న కాపులు
- అసలు గంటా కాపు కాదంటూ విమర్శలు
- వైఎస్సార్‌సీపీకే కాపునాడు మద్దతు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి అనిత కాపులతో వ్యవహరించిన తీరును... కాపు నేతలు ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. నాడు చెప్పుతో కొట్టి కేసులు పెట్టి వేధించిన అనిత... ఇప్పుడు ఓట్లు కావాలంటూ పైరవీలు చేస్తుండటం విమర్శలపాలవుతోంది. తమ సొంత సామాజికవర్గాన్ని వేధించిన అనితకు మద్దతుగా భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు నియోజకవర్గానికి వచ్చి సర్దిచెప్పేందుకు ప్రయత్నించడంపై ఆ వర్గాలు మండిపడుతున్నాయి. అనితను వ్యతిరేకించినందుకు ఏకంగా పార్టీ నుంచి కొద్దిమంది నేతలు సస్పెండ్ అయ్యారు. తమ వెనుక ఉండి నడిపించిన గంటా... తీరా తన సీటు కోసం తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా మళ్లీ అనితకు మద్దతివ్వాలంటూ పాయకరావుపేట నియోజకవర్గానికి వచ్చి మరీ చెప్పడాన్ని కాపులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో అసలు గంటా కాపు కాదని కాపునాడు తీవ్రంగా విమర్శలు చేసింది. కాపు సామాజికవర్గానికి పెద్ద ఎత్తున సీట్లు ఇచ్చిన వైఎస్సార్‌సీపీకే తమ మద్దతని స్పష్టంగా ప్రకటించింది. మొత్తంగా తమ సామాజికవర్గాన్ని తీవ్రంగా అవమానించిన అనితతోపాటు ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టిన గంటాకూ తమ దెబ్బ రుచి చూపిస్తామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అనిత బాధితులెందరో...!

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనిత నియోజకవర్గంలోని నేతలందరిపైనా అధికారం చెలాయించారు. కాపు నేతలపై మరింత కక్షపూరితంగా వ్యవహరించారు. ఏకంగా కాపు నేతలను చెప్పుతో కొట్టడమే కాకుండా కేసులు బనాయించి మరీ వేధించారు. కాపుల మద్దతుతో 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనిత మంగవరం గ్రామానికి చెందిన ఒక కాపు యువకుడ్ని నడిరోడ్డుపై చెప్పుతో కొట్టారు. తనపై తప్పుగా వ్యాఖ్యలు చేశాడన్న ఆగ్రహంతో చెప్పుతో కొట్టి కాపు జాతిని ఘోరంగా అవమానించారు. మహిళా ఎమ్మెల్యేను కించపరిచే విధంగా మాట్లాడటం తప్పే కానీ.. పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదా ఆ సామాజిక వర్గం పెద్దల సమక్షంలో మందలించడం దీనికి పరిష్కారం. ఇవేమీ చేయకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేనన్న అహంకారంతో వ్యవహరించారు. చెప్పుతో కొట్టిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా అప్పట్లో పెద్ద సంచలనం అయింది. అదే విధంగా ఆనాడు ఆమె గెలుపులో కీలక పాత్ర పోషించిన కాపు సామాజికవర్గానికి చెందిన జనసేన సీనియర్ నేత గెడ్డం బుజ్జిపై అత్యాచారం కేసు పెట్టించింది. అతన్ని అరెస్టు చేయించడానికి తన అధికారాన్ని అంతా ఉపయోగించింది. బుజ్జికి చెందిన భూములపై సిట్‌కు ఫిర్యాదు చేసింది. అప్పట్లో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు బుజ్జికి అండగా నిలబడటంతో ఆయన అరెస్టు నుంచి బయటపడ్డారు. తన గెలుపునకు సహకరించిన మరో కాపు నేత తోట నగేష్ పట్ల కూడా ఆమె నిర్లక్ష్య వైఖరి అవలంబించింది. అనిత ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఈ ఇద్దరు నేతలు తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నారు. అలాగే పట్టణానికి చెందిన మరో ఇద్దరు కాపు టీడీపీ నాయకులు గొర్లె రాజబాబు, మజ్జూరి నారాయణ రావుల పట్ల కూడా అనిత కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ఈ ఇద్దరు నాయకులు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో సన్నిహితంగా ఉండటం, వారు వేసిన ఫ్లెక్సీలో తన ఫొటో లేదన్న కారణంగా వారిద్దరినీ గత ఏడాది పార్టీ నుంచి సస్పెండ్ చేయించింది.

గంటా మధ్యవర్తిత్వంపై కాపుల్లో ఆగ్రహం

అనిత చేతిలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్న గెడ్డం బుజ్జి పలుసార్లు జనసేన సమావేశాలు ఏర్పాటు చేసి అనితకు మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని, ఓడించి తీరుతామంటూ గతంలో ప్రకటనలు చేశారు. కాపులను చెప్పుతో కొట్టి... తమ నేతపై రేప్ కేసు పెట్టిందని పదే పదే బుజ్జి అనుచరులు గుర్తు చేసుకుంటున్నారు. బుజ్జి మెత్తబడడాన్ని కూడా ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. తోట నగేష్ జనసేనలో చేరి అనితకు మద్దతుగా ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం పట్ల కూడా కాపు సామాజికవర్గంలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మొన్నటివరకు గంటా వర్గంగా ముద్రపడి... అనితను తీవ్రంగా వ్యతిరేకించిన గొర్లె రాజబాబు, నారాయణరావులు ఏకంగా పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే గంటా వీరి మధ్య రాజీ కుదిర్చారు. 'నీకు సీటు ఇవ్వాలంటే పాయకరావుపేటలో నీ వర్గాన్ని అనితకు మద్దతు ఇచ్చేలా చేయాల్సిందే'నంటూ చంద్రబాబు నుంచి గంటాకు ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తన స్వార్థం కోసం తనను నమ్ముకున్న వారి మనోభావాలను సైతం పట్టించుకోకుండా గంటా వ్యవహరించాడంటూ ఆ సామాజికవర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరోవైపు గంటాది అసలు కాపు సామాజికవర్గమేనా అని కాపునాడు నేతలు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు అత్యధిక సీట్లను కేటాయించిన వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తామని స్పష్టంగా పేర్కొన్నారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి



సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్

తుమ్మపాల: జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కోరారు.

శనివారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 72 గంటల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు నిషిద్ధమన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురికి మించి ఎక్కడా గుమిగూడరాదన్నారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అర్హులైన ఓటర్లందరికీ పోలింగ్ స్టేషన్ల వద్ద సురక్షితంగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణం కల్పించామన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.రామ్మూర్తి, డీటీ రవిబాబు, ఎస్‌ఎ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వలస పక్షులను నమ్మరు



అనకాపల్లి, మాడుగుల నియోజకవర్గాల్లో వలస పక్షులను నమ్మరు. గతంలో సినీ గ్లామర్‌తో వచ్చిన వారికి సైతం ఓటమి తప్పలేదు. ఎన్నికల తర్వాత నాన్ లోకల్ అభ్యర్థులు అందుబాటులో ఉండరు. ఎంపీగా నాకు లక్ష మెజారిటీ వస్తుంది. 50 ఏళ్ల అభివృద్ధి ఐదేళ్లలో చూపించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. 2019 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల పథకాలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించాం. 70 ఏళ్ల నుంచి గిరిజనులు ఎదురు చూస్తున్న గిరి గ్రామాల కోట్లాది రూపాయలతో రోడ్లు వేశాం. వేల కోట్లతో మాడుగుల నియోజకవర్గం రూపురేఖలు మార్చాను. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాను.

– బూడి ముత్యాలనాయుడు, ఎంపీ అభ్యర్థి అనకాపల్లి

మాడుగుల అభివృద్ధే జీవిత ఆశయం



నా తండ్రి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇప్పటికే మాడుగుల నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారు. నేను నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో తిరుగుతున్నాను. అక్కడ సమస్యలు గుర్తిస్తున్నాను. అధికారంలోకి రాగానే ప్రజలు అడగకుండానే వాటిని పరిష్కరిస్తాను. టీడీపీ, బీజేపీ అభ్యర్థులు మాట నమ్మితే నట్టేట ముంచుతారు. వలసలు వచ్చిన వారికి ఇక్కడ సమస్యలు తెలియవు. ఎన్నికల తర్వాత వారు కనిపించరు.

– ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాడుగుల



నాపేరు నంది ఎరుకులు. మాది దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ నేరేళ్లపూడి గిరిజన గ్రామం. గతంలో బియ్యం తీసుకోవాలన్నా, పింఛను అందుకోవాలన్న, కొండబాటలో ఐదు కిలోమీటర్ల దూరం నడిచి రెండు నదులు దాటి చింతలపూడి వచ్చేవారం. ఆరోజు ఇవ్వక పోతే మర్నాడు రాత్రికి ఇంటికి చేరేవాళ్లం. ఇప్పుడు వలంటీర్లు వచ్చి ఇంటికే పింఛను అందిస్తున్నారు. నేను పుట్టిన తర్వాత ఒక్క రాజకీయ నాయకుడు మా గ్రామానికి రానేదు. మూడు నెలల క్రితం డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు గెడ్డలు, గుట్టలు దాటి వచ్చి మా బాధలు చూశారు. తాగునీరుకు, ససర్కారు బడికి, అంగన్‌వాడీ కేంద్రానికి, రోడ్లకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నాయి. మా గ్రామాలకు వందల ఏళ్ల కల నెరవేరుతుంది. ఇంతకంటే అభివృద్ధి ఏం కావాలి. చాలా ఆనందంగా ఉంది.



నా పేరు శొలం రమేష్. మాది శంకరం పంచాయతీ కొత్తవలస గిరి గ్రామం. రహదారులు లేక మా తాతలు, తండ్రులు తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. కొండబాటలతోపాటు పెద్ద గెడ్డలు ఉన్నాయి. కష్టకాలంలో ప్రాణాలకు తెగించి గెడ్డలలో ఈదేవాళ్లం. మేము అడగకుండానే నేడు మా గ్రామాల కొండబాటలను బీటీరోడ్లుగా అభివృద్ధి చేశారు. ఇంటి వద్దకే రేషన్, ఇంటింటి కుళాయిలు, రూపాయి లంచం లేకుండా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారు. ఇంతకంటే అభివృద్ధి ఏమి కావాలి. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే పథకాలు అందజేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మా నియోజకవర్గాన్ని పాలించే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు మా గిరిజనుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మరలా సీఎంగా జగనన్నే రావాలి.



కామకూటం గిరిజన గ్రామానికి వేసిన పక్కారోడ్డు



మాడుగుల సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు



నాడు -నేడులో ఆధునికీకరించిన దేవరాపల్లి పీహెచ్‌సీ

ప్రగతి కళకళ



మాడుగుల అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాల నాణ్యత పరిశీలిస్తున్న ల్యాబ్ ఇన్‌చార్జి హేమ, సిబ్బంది



దేవరాపల్లి మండలం బోయిలకింతాడ ఆర్బీకేలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి ఫోకస్



మాడుగులలో నిర్మించిన వంతెన



మాడుగులలో అధునాతనంగా నిర్మించిన పీఆర్ వసతి గృహం

- గ్రామగ్రామాన రహదారి సౌకర్యం
- ఇంటింటికీ కుళాయిలు
- నెరవేరిన సొంతింటి కల
- రూ.120 కోట్లతో జలాశయాల ఆధునికీకరణకు శ్రీకారం
- ఐదేళ్లలో రూ.4,200 కోట్లతో కనీవినీ ఎరుగని సంక్షేమాభివృద్ధి
- ఆదర్శంగా మాడుగుల నియోజకవర్గం

మాడుగుల: ప్రగతి కల సాక్షాత్కారమైంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే మాడుగుల నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందింది. ఇక్కడ తెలుగుదేశం పార్టీకి 30 ఏళ్ల పాటు పట్టం కట్టినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదల గుడిసెలు పక్కా ఇళ్లుగా మారాయి. ఆ తర్వాత ఇప్పుడు మిగిలిన వారికి సొంతింటి కల నెరవేరింది.

ఐదేళ్ల అభివృద్ధిలో మచ్చుకు కొన్ని...

- నాడు- నేడు రెండు విడతల్లో నియోజకవర్గంలో 163 పాఠశాలలను రూ.60 కోట్లతో ఆధునికీకరించారు.
- నియోజకవర్గంలో 103 గిరి గ్రామాలతోపాటు మైదాన గ్రామాలకు రూ.160 కోట్లతో పక్కారోడ్లు నిర్మించారు. 520 సీసీరోడ్లను రూ.60 కోట్లుతో పూర్తి చేశారు.
- నియోజకవర్గంలో రూ.12.14 కోట్లతో రెండు సీహెచ్‌సీ, ఏడు పీహెచ్‌సీల ఆధునికీకరణ
- రూ.80 లక్షలతో మాడుగులలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు
- నియోజకవర్గంలో 78 సచివాలయాలు, 78 ఆర్బీకేలు, 68 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు రూ.65 కోట్లు మంజూరు కాగా, దాదాపుగా పనులు పూర్తి కావస్తున్నాయి.
- నియోజకవర్గంలో రూ.130 కోట్లతో ఇళ్లు మంజూరు చేశారు. ఇవి కాకుండా బ్యాంకు రుణాలు 24 కోట్ల 36 లక్షల 55 వేల రూపాయలు మంజూరు చేశారు. 96 జగనన్న లేఅవుట్లతోపాటు 2,773 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. సొంత స్థలాలు ఉన్నవారికి 5,333 జగనన్న ఇళ్లు మంజూరు చేయగా, నిర్మాణంలో ఉన్నాయి. పీఎంఏవైజీ 1,380 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి.

రైతు కష్టాలు తెలిసిన నేతలు



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈర్లె అనురాధ, బూడి ముత్యాలనాయుడులకు రైతు కష్టాలు తెలుసు. సీఎం జగన్ ఆర్బీకేలు, అగ్రిల్యాబ్ ఏర్పాటు చేసి ఆదుకుంటున్నారు. రైతు భరోసా అందడంతో పెట్టుబడికి ఇబ్బందులు లేవు. గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, తదితర పథకాలు అందుతున్నాయి. రైతు బాంధవుడు జగన్‌ను సీఎంగా మరలా గెలిపించుకుంటాం.

– కొటకల శ్రీను రైతు, అర్జునగిరి, చీడికాడ మండలం

50 ఏళ్ల తర్వాత మహిళకు అవకాశం

మేము పుట్టక ముందు మాడుగుల మహారాణి, బొడ్డు కళావతి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మరలా 50 ఏళ్ల తర్వాత వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న ఈర్లె అనురాధను గెలిపించుకుంటే మా బతుకులు బాగుంటాయి. వలసగా వచ్చినవారిని నమ్మితే, నట్టేట ముంచి వెళ్లిపోతారు. ఇప్పటికే మా కుటుంబానికి రైతు భరోసా, వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాలు రూపాయి లంచం లేకుండా బ్యాంకు ఖాతాలకు జమవుతున్నాయి.

– పోలిమేర విజయలక్ష్మి, మాడుగుల

దర్జీలను గుర్తించింది జగనే



రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాక దర్జీలకు పని లేకుండా పోయింది. కుటుంబ పోషణ కష్టంగా మారే పరిస్థితిలో ఏటా రూ.10 వేలు అందజేసి ఆదుకుంటున్నారు. ఈ వృత్తిపై బతకలేక నేటి యువత ఆసక్తి చూపలేదు. దర్జీలను మొదటిగా గుర్తించింది సీఎం జగన్ ఒక్కరే, మరలా ఆయన అధికారంలోకి రావాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను గెలిపించుకుంటాం.

– రాఖీ శ్రీను, దర్జీ, మాడుగుల

కేజీహెచ్‌ను తలదన్నేలా...

సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉన్నత వైద్య సేవలు పొందాలంటే విశాఖలోని కేజీహెచ్‌కు పరుగులు తీయాలి. ఇక అత్యవసర సేవలు సైతం అక్కడే పొందాల్సిఉంది. ఇకపై ఈ ప్రాంతంలో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ఉండాలనే దృఢ నిశ్చయంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైద్య విద్యతో పాటు అధునాతన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించింది.



నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలు

- రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం
- 630 పడకలతో ఆధునిక వైద్యం
- ఏడాదిలో అందుబాటులో వైద్యసేవలు



మెడికల్ కళాశాల నమూనా చిత్రం

మాకవరపాలెం : కేజీహెచ్‌ను తలదన్నేలా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మండలంలోని భీమబోయినపాలెం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం 52.17 ఎకరాలను సేకరించింది. ఇందులో కళాశాల నిర్మాణానికి రూ.500 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మాణ పనులకు ఏడాది క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో ఏడాదిలో పనులు పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు.


630 పడకలతో బోధనాస్పత్రి

ఏటా 150 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే విధంగా కళాశాల నిర్మాణమవుతుంది. ఈ కళాశాలకు అనుబంధంగా 630 పడకలతో బోధనాస్పత్రి సైతం అందుబాటులోకి రానుంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు అవసరమైన జనరల్ మెడిసిన్ బెడ్స్ 130, జనరల్ సర్జరీ బెడ్స్130, పీడియాట్రిక్స్ 75, ఆర్థోపెడిక్ బెడ్స్ 75, గైనకాలజీ 100, ఆప్తమాలజీ 20, ఇలా ఇతర విభాగాలకు సంబంధించి మొత్తం 630 పడకలు ఏర్పాటు కానున్నాయి. ఈ పనులు ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో ముమ్మరంగా సాగుతున్నాయి.

అందుబాటులోకి ఆధునిక వైద్య సేవలు

నర్సీపట్నం నియోజకవర్గంలో ఏ గ్రామంలోని ప్రజలకైనా అత్యవసర, ఆధునిక వైద్య సేవలు పొందాలంటే విశాఖ ఒక్కటే శరణ్యం. ఈ నేపథ్యంలో వ్యయప్రయాసలకోర్చి వైద్యం పొందాల్సివచ్చేది. ఈ తరుణంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ చొరవతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను మంజూరు చేయడం ఈ ప్రాంత వాసులకు శుభపరిణామంగా చెప్పవచ్చు. మెడికల్ కళాశాల రాకతో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

సీఎం రమేష్ మనుషులను అనకాపల్లి నుంచి ఖాళీ చేయించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కన్వీనర్ శ్రీరామ్

అనకాపల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తన మనుషులను వేలాది మందిని తీసుకొచ్చి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రైవేటు హోటళ్లు, అద్దెభవనాల్లో ఉంచారని, ఈ ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే విధంగా చర్యలు చేపడుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణలో ఎన్నికలు జరిగేవిధంగా అధికార యంత్రంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకోసం సీఎం రమేష్ మనుషులను అనకాపల్లి నుంచి ఖాళీ చేయించాలన్నారు. సొంత లాభం కోసం వెంపర్లాడే సీఎం రమేష్ ఈ ప్రాంతాన్ని దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. జిల్లాపై కనీస అవగాన లేని, రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చేందుకు కనీస స్థాయిలో పని చేయని ఆయనకు ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, బొప్పె ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా మలసాల భరత్‌కుమార్ తొలిసారిగా పోటీ చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఆయన సాఫ్ట్‌వేర్ పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించారు. ఆ రంగంలో రాణిస్తూనే ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల వైపు పిన్న వయస్సులోనే మొగ్గు చూపారు. వైఎస్సార్ సీపీ టికెట్ లభించడంతో ఎన్నికల బరిలో దిగారు. తనదైన శైలిలో నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను విశేషంగా ఆకట్టుకుని ఎన్నికల్లో విజయం సాధించగలమన్న ధీమాతో లక్ష్యం వైపు ముందుకు దూసుకుపోతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే విజయానికి దోహదపడతాయని చెప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. – కశింకోట

భరత్ అనే నేను..

సాక్షి ఇంటర్వ్యూ

- పారిశ్రామికంగా అభివృద్ధి చేసి...ఉపాధి కల్పిస్తా
- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తా
- అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

సాక్షి: ఎమ్మెల్యేగా ఎన్నికైతే నియోజకవర్గంలో ఎటువంటి కార్యక్రమాలు చేపడతారు?

భరత్‌కుమార్: ఎమ్మెల్యేగా ఎన్నికైతే అనకాపల్లి నియోజక వర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తాను. ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, హైదరాబాద్‌లో దాని బ్రాంచ్‌ను నెలకొల్పి సమర్థంగా నిర్వహిస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్నాను. అదేవిధంగా అనకాపల్లిలో కూడా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ నెలకొల్పి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధికి కృషి చేస్తాను.

సాక్షి: సీనియర్ నేతతో పోటీ పడుతున్నారు... ఎలా ఎదుర్కొన్నారు ?

భరత్‌కుమార్: నాకు రాజకీయ అనుభవం లేకపోయినా ప్రత్యర్థులను సమర్థంగా ఎదుర్కొగల పరిణితి, చాతుర్యం ఉన్నాయి. ఇప్పటికే నియోజక వర్గంలోని అన్ని గ్రామాలు పర్యటించి పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిక్షిప్తమయ్యాయి. సంక్షేమ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలకు లబ్ధి కలిగింది. కొందరికి రూ.లక్షల్లో కూడా ప్రయోజనం లభించింది. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. దీంతో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.

సాక్షి: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రభావం ప్రజల్లో ఎలా ఉంది?

భరత్‌కుమార్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నింటినీ దాదాపు అమలు చేశారు. మరింత మేలు చేసే విధంగా ఈసారి మేనిఫెస్టో రూపొందించారు. నవరత్నాలను కొనసాగిస్తూనే అమ్మ ఒడి, ఇతర పథకాలకు చెల్లించే నగదును పెంచారు. పింఛన్ల నగదును కూడా రూ.3 వేలకు అదనంగా రూ.500 పెంచుతూ ప్రకటించారు. ఇది జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో చెప్పిన పథకాలన్నింటిని అమలు చేస్తారు. చంద్రబాబునాయుడులా జగన్‌మోహన్‌రెడ్డి బూటకపు హామీలు ఇవ్వలేదు.

సాక్షి: మీకు ఓటర్లు ఎందుకు ఓటు వేయాలని భావిస్తున్నారు?

భరత్‌కుమార్: మాది రాజకీయ నేపథ్యం ఉన్న, నిరంతరం ప్రజా సేవకు అంకితమైన కుటుంబం. కశింకోట మండలంలోని అమీన్‌సా హెబ్‌పేట మా స్వగ్రామం. తాత మలసాల అప్పారావు 1960 నుంచి దీర్ఘకాలం సర్పంచ్‌గా పని చేశారు. తర్వాత తండ్రి మలసాల రమణారావు సర్పంచ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తల్లి మలసాల కాసులమ్మ మూడు దఫాలు జెడ్పీటీసీ సభ్యురాలిగా, ఒకసారి ఎంపీపీగా పని చేసి ప్రజలల్లో ఆదరాభిమానాలు పొందారు. ప్రస్తుతం సర్పంచ్‌గా ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉన్నత విద్య అభ్యసించాను. యూఎస్‌ఏ, హైదరాబాద్‌లలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు నెలకొల్పి సమర్థంగా నిర్వహిస్తూ రాణిస్తున్నాను. తల్లిదండ్రుల స్ఫూర్తితో ప్రజలకు విస్తృతంగా సేవలందించాలనే ధ్యేయంతో తొలిసారిగా రాజకీయాల్లో కి ప్రవేశించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పట్ల ఆకర్షితుడినై వైఎస్సార్ సీపీలో చేరాను. ఎంతో మంది పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు మాకే ఉంది.

సాక్షి: విజయానికి ఏ అంశాలు దోహదం చేస్తాయి ?

భరత్‌కుమార్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నా విజయానికి దోహదం చేస్తాయి. ముఖ్యమంత్రి ఐదేళ్లలో నవ రత్నాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా పార్టీలకు అతీతంగా అందించడంతోపాటు రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. ఇవి ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఎన్నికల ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతుండడం ఇందుకు నిదర్శనం.

సాక్షి: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో నమ్మకం ఉందంటారా?

భరత్‌కుమార్: సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు నమ్మకం లేదు. 2014లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను చంద్రబాబునాయుడు మోసగించారు. ఇప్పటికే పింఛన్ పెంపు హామీని మేనిఫెస్టో నుంచి తొలగించారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో అమలుకు సాధ్యం కాకపోవడంతో బీజేపీ కూడా దానితో సంబంధం లేదని ప్రకటించింది. మరోసారి ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరు.

సాక్షి: మీ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

భరత్‌కుమార్: రానున్న ఎన్నికల్లో నా విజయం ఖాయం. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అతి చేరువయ్యాను. ప్రతిచోట ప్రజలు విశేషంగా ఆదరించి అక్కున చేర్చుకున్నారు. ప్రజల ఆశీస్సులు, పార్టీ శ్రేణులు, అభిమానుల అండదండలతో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తాను.

పోలింగ్‌కు సర్వం సిద్ధం


యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు


రిసెప్షన్ కేంద్రంలో ఏర్పాట్లు


పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించడానికి సిద్ధంగా ఉంచిన బస్సులు

- యలమంచిలి నియోజకవర్గంలో బూత్‌లు : 246
- ఎన్నికల సిబ్బంది : 1,272 మంది

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 246 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి, సిబ్బందిని నియమించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు యలమంచిలి రిటర్నింగ్ కార్యాలయం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం నుంచి సిబ్బందికి సామగ్రి పంపిణీ చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా టెంట్లు వేసి, టేబుళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 246 పోలింగ్ స్టేషన్లకు ఇక్కడి రిసెప్షన్ కేంద్రం నుంచే సామగ్రిని పంపిణీ చేసి తరలించడానికి బస్సులు, ఇతర వాహనాలను సిద్ధం చేశారు. మొత్తం 1,272 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్టు రిటర్నింగ్ అధికారి కె.మనోరమ తెలిపారు. ఈవీఎం యంత్రాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంను ఆదివారం ఉదయం 7 గంటలకు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఎదుట తెరవనున్నారు. అనంతరం వాటిని పోలింగ్ సిబ్బందికి అప్పగించనున్నారు. పంపిణీ ప్రక్రియ సజావుగా జరగడానికి మొత్తం 28 కౌంటర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది గ్రామాలకు వెళ్లేందుకుగాను అధికారులు ప్రత్యేకంగా 72 బస్సులు, వ్యాన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో సిబ్బందితో పాటు పోలీసులు, కేంద్ర బలగాలు శాంతి భద్రతలు పరిరక్షించేందుకు విధులు నిర్వర్తించనున్నారు. 22 గ్రామాల పరిధిలో 49 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 246 పోలింగ్ కేంద్రాల్లో 2,06,394 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,00,407 మంది,మహిళా ఓటర్లు 1,05,978 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు.మరోవైపు పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తమైంది.ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పోలీసు అధికారులు సూచించారు.పోలింగ్ సజావుగా జరిగేందుకు పలు ఆంక్షలు విధించారు.ప్రజలంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని అధికారులు సూచించారు.

ఏర్పాట్లు పూర్తి



ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలు, సిబ్బంది అందరూ సహకరించాలి. ఈవీఎంల ర్యాండమైజేషన్,కమిషనింగ్ ఇప్పటికే పూర్తయింది. 246 మంది పీవోలు, 246 మంది ఏపీవోలు, 21 మంది సెక్టార్,21మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించాం.అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశాం. ఓటరు గుర్తింపు కార్డు లేకపోతే 12 రకాల ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానిని చూపి ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలి.

– కె మనోరమ, రిటర్నింగ్ అధికారి,యలమంచిలి

కశింకోటలో ముమ్మర ఏర్పాట్లు

కశింకోట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు మండలంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే స్థానిక బాలికలు, బాలుర ప్రాథమిక పాఠశాలలు, హౌసింగ్ కాలనీ పాఠశాల, డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో షామియానాలు ఏర్పాటు చేశారు. మండలంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా షామియానాలు, మంచినీటి సదుపాయం తదితర సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు.


కశింకోట బాలికల హైస్కూలులో ఏర్పాటు చేసిన షామియానాలు

మునగపాక: మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను సోమవారం పగడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండల వ్యాప్తంగా 56 పోలింగ్ బూత్‌లలో 45,414 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. చెర్లోపాలెంలో 800, రామగిరి-543, మడకపాలెం-550, మెలిపాక-1,697 ,చూచుకొండ-2,271, గణపర్తి-1,799, గంటవానిపాలెం-706, పురుషోత్తపురం-265, పల్లపు ఆనందపురం-760, అరబుపాలెం-1,592, ఒంపోలు-1,616, నాగులాపల్లి-4,847, గవర్ల అనకాపల్లి -1107, తోటాడ-3391, సిరసపల్లి-2,139,వెంకటాపురం-884, పాటిపల్లి-1,519, నారాయుడుపాలెం-1,377, మల్లవరం-766, కాకరాపల్లి-729, పాత నాగవరం-793, కొత్త నాగవరం-716, మల్లవరం-766, రాజుపేట-913, గొల్లలపాలెం-574, వాడ్రాపల్లి-1314, తిమ్మరాజుపేట-1796,మునగపాక-7,669, మూలపేట-956, గంగాదేవిపేట-322 ఓటర్లు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి, సీసీ కెమెరాల ఏర్పాటు పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడైనా గుమిగూడి ఉన్నా, ఎన్నికల్లో గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


స్క్రీనింగ్ పరీక్ష చేస్తున్న వైద్యులు శైలజ నమిత

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా వయసుతో సంబంధం లేకుండా ఏడాదికి మూడు సార్లు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు దరున్ ప్రసాద్, శైలజ నమితలు తెలిపారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో శంకరంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యపరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, ప్లాస్టిక్ ఎక్కువగా వినియోగించడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. మొదటి దశలో క్యాన్సర్‌ను గుర్తించి,సకాలంలో మందులు వాడడంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. అంతకు ముందు ఈశిబిరంలో 40 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు షామీమ్, ఆస్పత్రి సూపర్‌వైజర్ బి.సంఘం, ఎంఎల్‌హెచ్‌పీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో 12 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకుని, ఇళ్లపు ఈశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. మద్యం సీసాలను అక్రమంగా విక్రయించడానికి తన ఇంట్లో నిల్వ ఉంచగా అతన్ని పట్టుకున్నామన్నారు.

బంగారం, వెండి చోరీ

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు లక్ష్మీనారాయణనగర్‌లో ఈనెల 9న రెండుతులాల బంగారం, 50 తులాలవెండి చోరీకి గురైనట్టు ఎస్‌ఐ మహ్మద్‌అలీ తెలిపారు. లక్ష్మీనారాయణనగర్‌లోని తన ఇంట్లో గ్రంధి శశిక్రాంత్ గుప్త ఈనెల 9న నిద్రిస్తుండగా, మరో గదిలో కిటికీ ఐరన్‌గ్రిల్స్ తొలగించి ఇంటిలోకి దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్న
ప్రతిపక్ష నాయకులు


గాంధీ మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాలు, పట్టణాల్లో ప్రచారానికి తిరుగుతున్న సమయంలో అక్కడ జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో హోల్‌సెల్ కూరగాయల మార్కెట్, అరటిపళ్ల మార్కెట్, గాంధీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో శనివారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతూ చంద్రబాబు బూటకపు మేనిఫెస్టోను విడుదల చేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి నివేదిత, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, వివిధ దేవాలయాల చైర్మన్లు కె.ఎం.నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మునగపాక: ఐదేళ్ల కాలంలో జరిగిన ప్రగతి,సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాండ్రేగుల యశ్వంత్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గణపర్తిలో శుక్రవారం రాత్రి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ,యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.సర్పంచ్ చదరం నాయుడు పాల్గొన్నారు. టి.సిరసపల్లిలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి,చూచుకొండలో సర్పంచ్ దొడ్డి సూరప్పారావు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ,మల్లవరంలో సర్పంచ్ ఇందల హేమలత నాయుడు ఇంటింటా ప్రచారం నిర్వహించి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న ఆడారి కిషోర్‌కుమార్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ నేత ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ గతంలో మంత్రిగా ఉండగా అనకాపల్లికి చేసింది ఏమీ లేదని, జనసేనకు ఓటువేస్తే అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. బ్యాంకులకు టోకరా వేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా లోకల్ వ్యక్తికి టిక్కెట్ ఇవ్వాలని కోరిన అయ్యన్నపాత్రుడు ఇప్పుడు సీఎం రమేష్‌కు ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. 2014ఎన్నికల్లో టీడీపీ 600 బూటకపు హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిందని, అధికారం చేపట్టిన తరువాత చెత్తబుట్టలో వేసింది చెప్పారు. ప్రస్తుత టీడీపీ మేనిఫెస్టోను బీజేపీ వ్యతిరేకించిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ద శ్రీను, యల్లపు గాంధీ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని వినతి


సీపీవో రామారావుకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

తుమ్మపాల: ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగ,ఉపాధ్యాయులందరికీ సౌకర్యాలు కల్పించాలని పీఆర్టీయూ నాయకులు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సిబ్బంది డ్యూటీ పడిన ప్రాంతానికి వెళ్లి, రావడానికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. బస్సుల రాకపోకలపై పూర్తి వివరాలతో ఆర్టీసీ అధికారుల నుంచి అప్‌డేట్ ఇవ్వాలన్నారు. సామగ్రి ఇచ్చే సమయంలో, తిరిగి పుచ్చుకునే సమయంలో ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల విధుల్లో హాజరయ్యే సిబ్బందికి వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు డి.గోపినాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, జిల్లా నాయకులు గంట్ల కృష్ణ, అలంక ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.



భూమికి భద్రత.. యజమానికి భరోసా

చంద్రబాబు.. అబద్ధాలకు బ్రాండ్.. ఒక అబద్ధాన్ని పదేపదే **చెప్పడం.. దానికి పచ్చ మీడియా** చంద్రబాబు చెప్పింది నిజమేనంటూ కథనాలు రాయడం ఇద**ంతా ఓ స్క్రిప్ట్ ప్రకారం జరుగుతున్న** కుట్ర. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు ఈనాటివి కావు. సోష**ల్ మీడియా లేని కాలంలో పత్రికలు,** వార్తా చానళ్లనే ప్రజలు ఎక్కువగా విశ్వసించేవారు. అందుకే చం**ద్రబాబు రాజకీయాల్లోకి అడుగుపెట్ట** గానే మీడియా సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. విజన**రీ లీడర్‌నని ప్రజలను చంద్రబాబు** గుడ్డిగా నమ్మించాడు. అన్ని రోజులు మనవి కావు. వాస్తవాలు **చెప్పే మీడియా ఒకటుంటుందని** పాపం చంద్రబాబు కలలో కూడా ఊహించి ఉండడు. అందుకే చంద్రబాబు చెప్పే శ్రీరంగనీతులను ప్రజలు ఇప్పుడు విశ్వసించడం లేదు. అయినప్పటికీ నరనరాల్లో కాలకూట విషయం నింపుకున్న చంద్రబాబు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూనే ఉన్నాడు. తాజాగా 'ల్యాండ్ టైట్లింగ్ 'యాక్ట్ విషయంలో చంద్రబాబు, పచ్చ మీడియా దుష్ప్రచారానికి తెర తీసింది.

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై పరాకాష్టకు చేరిన పచ్చ పైత్యం
- ప్రజలను గందరగోళానికి గురి చేసేలా చంద్రబాబు కుట్రలు
- పొగిడిన నోళ్లతోనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై నిస్సిగ్గుగా దుష్ప్రచారం
- చంద్రబాబును గద్దెనెక్కించడానికి పచ్చ పత్రికల తప్పుడు కథనాలు
- చట్టంతో పక్కాగా భూ హక్కులు అంటున్న న్యాయ నిపుణులు
- భూ వివాదాలకు చెక్.. భూ యజమానులకు రక్షణ, బీమా..

విశాఖ సిటీ/విశాఖ లీగల్:

భూములకు రిజిస్ట్రేషన్లు చేసి డాక్యుమెంట్లు యజమానులకు ఇవ్వరా? తెల్ల కాగితాలపై రిజిస్ట్రేషన్లు చేసేస్తారా? ప్రజల ఆస్తులను ప్రభుత్వం కాజేస్తుందా? 'ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్' విషయంలో చంద్రబాబు, పచ్చ మీడియా ఈ తరహా దుష్ప్రచారాన్ని ఎందుకు చేస్తోంది? నిజం గడప దాటే లోపే అబద్ధం ఊరంతా చుట్టేస్తుందన్న నానుడిని చంద్రబాబు అండ్ కో బాగా వంటపట్టించుకుంది. ఒక అబద్ధాన్ని పదే పదే జనాలపై రుద్దితే.. నిజమనుకుంటారని పచ్చ మీడియా నిస్సిగ్గుగా విషపు రాతలతో అసలు వాస్తవాన్ని సమాధి చేస్తోంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములకు భద్రత అని నాలుగు నెలల కిందటే ప్రశంసిస్తూ చానళ్లలో ప్రసారం చేసిన పచ్చ మీడియాకు.. ఈ యాక్ట్ రైతులకు వరమంటూ అసెంబ్లీ సాక్షిగా అభివర్ణించిన టీడీపీ ఎమ్మెల్యేలకు.. ఎన్నికల దగ్గర పడే సరికి ఎందుకు అక్రమమైన చట్టంగా మారిపోయిందన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎన్నికల్లో నేరుగా ఢీ కొట్టలేక.. ఏడు పదుల వయసులో చంద్రబాబు పచ్చి అబద్ధాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించి.. మోసం చేసి అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నారు. చంద్రబాబును గద్దెనెక్కించడానికి పచ్చ పత్రికలు, మీడియా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు కథనాలు రాస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి.. ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయి. అయితే ఈ కొత్త చట్టం అమల్లోకి వస్తే భూ యజమానులకు పూర్తి రక్షణ లభిస్తుందని న్యాయవాదులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూ యజమానులకు జరిగే మేలేంటి? ప్రతి పక్షాల ప్రచారంలో నిజమెంత? న్యాయవాదులు ఏం చెబుతున్నారో? చూద్దాం..

పక్కా భూ హక్కులు కల్పించడానికే చట్టం

జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూమితో పాటు ఇంకా చాలా రకాల భూములు ఉన్నాయి. అయితే వాటికి సంబంధించి పదుల సంఖ్యలో రికార్డులు ఉన్నాయి. అవి కూడా ఎప్పుడో బ్రిటిష్ కాలానికి సంబంధించినవి. గ్రామాల్లో భూ వివాదాలు చోటు చేసుకుంటే.. 90 శాతం మంది ప్రజలు వాటిని స్థానికంగానే పరిష్కరించుకుంటారు. ఎందుకంటే భూ వివాద కేసులపై కోర్టుకు వెళ్తే ఏళ్ల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తుందని భయం. ఆ లోపు ఆ భూమి ఎవరికీ హక్కు లేకుండా.. ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని భావిస్తుంటారు. సరైన రికార్డు లేకపోవడం, ఉన్న రికార్డులు తప్పుల తడకలుగా ఉండడంతో కోర్టులో ఏళ్ల తరబడి కేసులు సాగుతున్నాయి. వాటిని పరిష్కరించి భూ యజమానికి ఆ భూమిపై పక్కా యాజమాన్యపు హక్కు కల్పించి, వారి వారసులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయడమే ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ముఖ్య ఉద్దేశం. అలాగే అసలు ఎంత భూమి సాగులో ఉంది? వ్యవసాయేతర భూమి ఎంత ఉంది? ఎవరి ఆధీనంలో ఉంది? అనే విషయాలు టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

భూ యజమానులకు భరోసా

- ప్రస్తుతం ఉన్న రికార్డుల్లో భూమి మన పేరున **ఉన్నా..** వేరే వ్యక్తులు ఆ భూమి తమదేనని అప్పీల్ చేసు**కునే అవ**కాశం ఉంది. కానీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమ**ల్లోకి వస్తే** భూమి యజమానులకు అలాంటి తలనొప్పి ఉ**ండదు.**
- ఎవరు పడితే వారు.. ఇది నా భూమి అని **యాజమా**నులపై కేసులు వేసే అవకాశం ఉండదు.
- భూముల లెక్కలు తేల్చిన తర్వాత.. ఎలా**ంటి వివాదం** లేని భూములను టైటిల్ రిజిస్టర్‌లో నమోదు **చేస్తారు.**
- వివాదాల్లో ఉన్న భూమి వివరాలను ఓ ప్ర**త్యేక రిజిస్టర్‌లో** పొందుపరుస్తారు.
- ఆ వివాదాలను పరిష్కరించేందుకు జిల్లా స్థా**యిలో ఒక ట్రిబ్యునల్,** రాష్ట్ర స్థాయిలో మరో ట్రిబ్యునల్‌ను ఏర్పా**టు చేస్తారు.**
- రాష్ట్ర ట్రిబ్యునల్ తీర్పు మీద అభ్యంతరాలు **ఉంటే హైకోర్టును** కూడా ఆశ్రయించే అవకాశం కల్పిస్తోంది ఈ ల్యా**ండ్ టైటిలింగ్ యాక్ట్.**
- ఈ చట్టం ప్రకారం భూ యజమానిని ఒకసారి **నిర్ధారిస్తే అదే ఫైనల్** అవుతుంది.
- భవిష్యత్తులో అధికార బలంతో, రాజకీయ **నాయకుల అండతో** ఎవరూ కూడా భూమిని కబ్జా చేసే అవకాశం **కానీ, భూమి తమదే అని** కోర్టుకు వెళ్లే పరిస్థితి కానీ ఉండదు.

90 శాతం భూ వివాదాలకు చెక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూ యజమానులకు **భరోసా దక్కనుందని న్యాయ నిపుణు**లు తేల్చి చెబుతున్నారు. ఈ చట్టం అమలైతే భూ వివాదాలు 90 **శాతం మేర కనుమరుగవుతాయని** అంటున్నారు. టైటిల్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలకు ప్రభుత్వం **పూర్తి బాధ్యత వహిస్తుంది.** ప్రస్తుతం రికా**ర్డులో** ఉన్న వివరాలకు ప్రభుత్వ గ్యారెంటీ లేదు. 1బీలో ఉన్నా, **అడంగల్‌లో ఉన్నా, ఆర్ఎస్ఆర్**లో ఉన్నా ప్రభుత్వ గ్యారెంటీ ఉండదు. సుప్రీంకోర్టు ఇచ్చిన పలు **తీర్పుల్లో.. రెవెన్యూ రికార్డుల్లో పేరున్నం**త మాత్రాన అతను భూ యజమాని కాదని, రెవెన్యూ రికార్డులు **యాజమాన్య హక్కులకు సాక్ష్యంగా** పనికి రావని స్పష్టం చేసింది. టైట్లింగ్ చట్టం కింద రూపొందిన **రిజిస్టర్ ప్రకారం ప్రిజం**ప్టివ్ రికార్డు వ్యవస్థ స్థానంలో టైటిల్ గ్యారెంటీ వ్యవస్థ వస్తుంది.

భూ యజమానులకు బీమా

ఒకసారి టైటిల్ రిజిస్టర్‌లో పేరు వచ్చిన తర్వాత ఏదైనా నష్టం జరిగిందని భూ యజమాని **నిరూపించుకోగలిగితే బీమా సైతం ఇస్తారు. భూమి హ**క్కులకు ఇబ్బంది కలిగితే టైటిల్ ఇన్సూరెన్స్ **ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా తెలిపారు. పైగా భూ**ముల రిజిస్ట్రేషన్ జరుగుతున్నప్పుడే టైటిల్ **వెరిఫికేషన్ నిర్వహిస్తారు. అమ్మేవాడికి** టైటిల్ ఉంటేనే కొనేవాడికి వస్తుంది. దీనివల్ల **మోసం జరగడానికి వీలు లేకుండా పోతుంది.** భూ యజమానులకు పూర్తి రక్షణ కల్పించే **ఇంత పకడ్బందీ చట్టంపై జరుగు**తున్న ప్రచారాన్ని న్యాయ నిపుణులు కూడా తప్పుపడుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే అమలు

ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ను అన్ని గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ **చేపట్టనున్నారు. ఈ విషయాన్ని ఇప్ప**టికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, **మంత్రులు అనేక దఫాలుగా** తేల్చి చెప్పారు. ప్రస్తుతం సమగ్ర భూ సర్వే **పూర్తయిన గ్రామాల్లో ప్రజాభి**ప్రాయ సేకరణ చేపట్టి.. అందులో ఎటువంటి **అభ్యంతరాలు లేవని నిర్ధారించిన** తరువాతే.. ఆ గ్రామస్తుల నిర్ణయం మేరకు **ఆ గ్రామాన్ని చట్ట పరిధిలోకి తీసుకురా**వాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. **అయినప్పటికీ చంద్రబాబు, ప**చ్చ పత్రికలు, మీడియా ఈ చట్టంపై ప్రజల్లో **గందరగోళం సృష్టిస్తున్నాయి. రాజకీ**య లబ్ధి కోసం ప్రజలను భయభ్రాంతులకు **గురి చేసి అధికారంలోకి** రావాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఒకే టైటిల్ రిజిస్టర్

భూమి హక్కులకు సంబంధించి ప్రస్తుతం 30కి పైగా రికార్డులున్నాయి. గ్రామ స్థాయిలో 1బీ, అసైన్‌మెంట్, ఇనాం వంటి 11 రిజిస్టర్లు ఉన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో కొన్ని, సర్వే కార్యాలయంలో మరికొన్ని, సబ్ రిజిస్ట్రార్, పంచాయతీ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో భూములకు సంబంధించి వివిధ రికార్డులను నిర్వహిస్తున్నారు. అటవీ, దేవదాయ, వక్ఫ్ వంటి పలు శాఖల్లోనూ భూముల రికార్డులు ఉన్నాయి. ఇన్ని రికార్డులు ఉన్నా, చట్టపరంగా ఏదీ కూడా తుది రికార్డు కాదు. ఈ రికార్డుల్లో పేరున్నా.. వేరే వాళ్లు అది తనదని అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. భూ యజమానికి తన భూమి తనదనే పూర్తి భరోసా లేదు. ఈ సమస్యకు కొత్త చట్టంలో చక్కని పరిష్కారం చూపనుంది ప్రభుత్వం. వాస్తవానికి ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలైతే అన్ని రకాల భూముల రికార్డుల స్థానంలో ఒకే ఒక టైటిల్ రిజిస్టర్ రానుంది. వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమితో పాటు ఆ భూమి ఏ శాఖ పరిధిలోనిదైనా, ఏ వ్యక్తిదైనా, ఏ భూమైనా సరే దాని హక్కుదారు ఎవరనేది.. ఒకే రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఇప్పటివరకు వేర్వేరు రికార్డుల్లో ఉన్న పేర్లలో వ్యత్యాసాలు, తేడాలు, తప్పులు, ఇతర సమస్యలన్నీ కొత్త చట్టం ద్వారా పరిష్కారమవుతాయి. ఎటువంటి అభ్యంతరాలు లేని పేర్లే టైటిల్ రిజిస్టర్‌లో ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వ సూచనలతో చట్టం

నీతి ఆయోగ్ ప్రతిపాదనతో ల్యాండ్ టైటిల్ యాక్ట్ తెరపైకి వచ్చింది. ఈ చట్టం తేవాలని అన్ని రాష్ట్రాలకూ చాలా ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తూ వచ్చింది. కేంద్రం సూచనలతో ఈ చట్టం రూపుదిద్దుకున్నా.. ఇంకా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించి ఆమోదం కోసం కేంద్రానికి పంపించింది. అయితే కేంద్రం పలు సందేహాలను లేవనెత్తగా వాటిని రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేసి మరోసారి కేంద్రం ఆమోదానికి పంపించింది.

చట్టం గురించి తెలుసుకుని మాట్లాడాలి



ప్రజల దగ్గర మాట్లాడే ముందు చట్టం పూర్వాపరాలు తెలుసుకోవాలి. భూ పరిరక్షణ చట్టం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. రైతుల భూముల హక్కులు, భూ హక్కు పత్రాలు ప్రభుత్వం చేతికి వెళ్లిపోతాయన్నది తప్పుడు ప్రచారం. ఈ చట్టం ద్వారా భూ వివాదాలకు అవకాశం ఉండదు. భూ యజమానులకు భరోసా ఉంటుంది. ప్రస్తుతం ఈ చట్టం అమలులో లేదు. అమలుకు కనీసం మూడేళ్ల సమయం పట్టే అవకాశముంది.

– సిస్లా శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది

చంద్రబాబు వ్యాఖ్యలు చట్ట విరుద్ధం



చట్టంగా రూపొందించకముందే చంద్రబాబు వ్యాఖ్యలు చట్ట విరుద్ధం. అసలు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఇంకా అమల్లోకే రాలేదు. ఎవరి భూ హక్కు పత్రాలు ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవడం జరగదు. చట్ట పరిధిలో లేని అంశాలపై మాట్లాడుతున్న వ్యక్తులు వాస్తవాలను తెలుసుకోవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో గందరగోళం సృష్టించ కూడదు. రిజిస్ట్రేషన్ పత్రాలు ప్రభుత్వం దగ్గర ఉంటాయంటే ఎవరూ నమ్మరు.

– రాచకొండ ఉమా శాస్త్రి, సీనియర్ న్యాయవాది

ఇది ముసాయిదా మాత్రమే..



ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్రం ప్రతిపాదించింది. ఇంకా చట్ట రూపం దాల్చలేదు. కేవలం ముసాయిదా మాత్రమే సిద్ధమైంది. ఈ చట్టంపై పలువురు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తి అసత్యాలు. కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. భూములను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రిజిస్ట్రేషన్ పత్రాలు భూ యజమానుల వద్దే ఉంటాయి. ఈ చట్టంతో వివాదాలు లేని భూ హక్కులు లభిస్తాయి.

– టి.ఎస్.డి.శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది

ప్రజల కోసమే..



ఈ చట్టం నూటికి నూరు శాతం ప్రజల కోసం పనిచేసేది. ఎందరో మేధావులు, న్యాయ నిపుణులు పర్యవేక్షణలో ఈ చట్టం వచ్చింది. ఈ చట్ట పరిధిలోని కేసులు విచారణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేస్తారు. పూర్తిస్థాయిలో పనిచేయడానికి కనీసం మూడు నాలుగేళ్లు పడుతుంది. ఈ చట్టం ముఖ్య ఉద్దేశం ఒక పేద వ్యక్తి తన భూహక్కును పరిరక్షించుకోవడం. ఇందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

– ఆకెళ్ల రమణమూర్తి, ప్రముఖ న్యాయవాది, భూ సవరణ చట్టం నిపుణులు

సవరణకు ట్రిబ్యునల్స్ ఏర్పాటు



ఈ చట్టం శత శాతం ప్రజల మేలుకోరేదే.. ఇందులో ఏ విధమైన దాపరికం లేదు. ప్రతిపక్షాల వ్యాఖ్యలు అవాస్తవాలు. ప్రజల భూములను తీసుకునే హక్కు ఎవరికీ లేదు. ఏవైనా అవకతవకలు కానీ మార్పులు కానీ ఉంటే సవరించుకునేందుకు ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రతి వ్యక్తి తమ అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదించుకోవచ్చు. గతంలో భూ కబ్జాలు జరిగితే సన్న కారు పేద మధ్య తరగతి వారు ఏమి చేయలేకపోయారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తవు.

– జి.ప్రేమసాయి, ప్రముఖ న్యాయవాది

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



దేశంలో వందేళ్ల క్రితం చేసిన సర్వే ఆధారంగానే ఈ రోజుకూ భూముల యాజమాన్య హక్కులు నిర్ధారిస్తున్నారు. ఈ క్రమంలో అనేక సమస్యలు తలెత్తి కోర్టుల్లో లక్షలకొద్దీ వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. రైతులు కోర్టు కేసులతో ఆర్థికంగా చితికిపోతున్నారు. వారందరికీ మంచి చేయాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం రీసర్వే చేపట్టి భూ హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే శతశాతం భూ సమస్యలను అధిగ**మించవచ్చు.**

– కె.సాయిరాం, ప్రముఖ న్యాయవాది, అనకాపల్లి

కోర్టుకెళ్లే అవకాశం కల్పించాలి



పాత భూ రికార్డుల స్థానంలో భూమిపై హక్కులు గల వారి పేరుతో కొత్త రికార్డులను మంజూరు చేసి ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వమే భరోసా తీసుకోవడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ఇది భూహక్కుదారులకు ఎంతో మేలు చేస్తుంది. విప్లవాత్మకమైన నిర్ణయం. అయితే బాధితులు న్యాయం కోసం వారికి అవకాశం ఉన్న కోర్టులో కేసు వేసుకునే సౌకర్యం కల్పించాలి. అప్పుడే పొరపాట్లు సరిదిద్దుకునే అవ**కాశం ఏర్పడుతుంది.**


–ఎ.ఎస్.వి.వి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది, అనకాపల్లి

ఎన్నో ప్రయోజనాలు



ఏదైనా స్థిరాస్తిపై వివాదం వస్తే కింది స్థాయి కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు 20 నుంచి 30 సంవత్సరాలు తిరగాల్సి వస్తోంది. న్యాయం జరిగేసరికి ఒక తరం భూయజమానులు వృద్ధులు కావడం, కొందరు మరణించడం జరుగుతోంది. తాజా చట్టంతో ప్రజలకు భూమిపై సంపూర్ణ హక్కులు త్వరితగతిన దక్కుతాయి. రకరకాల రికార్డులు కాకుండా ఒకే రెవెన్యూ రికార్డు ఉంటుంది. ఈ తరహా సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుంది.

– ఎస్.వి.ఎ.ప్రసాద్, సీనియర్ న్యాయవాది, యలమంచిలి



తస్మాత్.. జాగ్రత్త!

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. ఇప్పటి వరకూ ప్రచారంలో మునిగి తేలిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అందులోనూ తొలిసారి బరిలోకి దిగుతున్న అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే, అభ్యర్థులు పోలింగ్ సమయంలో ఏ నిబంధనలు పాటించాలి, అధికారులతో ఎలా మెలగాలి, ఓటర్ల పట్ల ఎలా వ్యవహరించాలి, నిఘా నేత్రాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండటంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. పోలింగ్ సరళి ఎలా ఉంటుంది.. తదితర అంశాల సమాచారం మీ కోసం...

– సాక్షి, విశాఖపట్నం

పార్టీ కండువాలకు అనుమతి లేదు..



అభ్యర్థులు పార్టీ లేదా ఎన్నికల గుర్తుల బ్యాడ్జీలు పెట్టుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు వీలు లేదు. కండువాలు, బ్యాడ్జీలతో లోపలికి వస్తే ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లుగా భావించి చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులకు సంబంధించిన పోలింగ్ ఏజెంట్లకు పాస్‌లు జారీ చేస్తారు. ఆ పాస్‌ల ఆధారంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి పోలింగ్ సరళి, పోలింగ్ శాతం తెలుసుకోవచ్చు.

గుర్తింపుకార్డు తప్పనిసరి..



పోలింగ్ కేంద్రానికి వెళ్లే ముందు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. ఓటర్ కార్డు లేకపోతే ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌బుక్ (బ్యాంకు /పోస్టాఫీసు వారు ఫొటోతో జారీ చేసినవి), హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసింది), డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, స్మార్ట్ కార్డు(కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసింది), పాస్ పోర్ట్, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడీ కార్డు, (కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసినవి), ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, యూనిక్ డిసేబిలిటీ ఐడీ కార్డుల్లో ఏదో ఒక దానితో ఓటు వేయవచ్చని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. ఓటర్ స్లిప్పులు గుర్తింపు కార్డులు కాదని స్పష్టం చేసింది. అవి కేవలం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నంబర్ తెలుసుకునేందుకు మాత్రమే ఉపయోగపడతాయి.

దురుసుగా ప్రవర్తిస్తే...



ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులతో జాగ్రత్తగా ఉండాలి. దురుసుగా ప్రవర్తించరాదు. పోలింగ్ కేంద్రంలోకి చొచ్చుకుపోయి ఓటు వేయకుండా ఓటర్లను అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కేసుల్లో ఇరుక్కోక తప్పదు. రుజువైతే ఆరు నెలలు జైలు, రూ. రెండు వేలు జరిమానా కూడా విధిస్తారు. ప్రతి ఎన్నికలోనూ కేసు నమోదవుతుంది.

గొడవ పడితే ఇబ్బందే..



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సహనం అవసరం. ఇది కోల్పోతే మూల్యం చెల్లించాల్సిందే. ప్రత్యర్థులు ఎంత రెచ్చగొట్టినా ఓపికతో ఉండడం, గెలుపు ఓటములు ఎలా ఉన్నా శాంతంగా లేకుంటే చిక్కులు తప్పవు. ప్రత్యర్థుల అనధికార కార్యక్రమాలను అధికారుల దృష్టికి తీసుకురావాలే తప్ప నేరుగా గొడవ పడకూడదు.

ఎండతో జాగ్రత్త..

- పోలింగ్ కేంద్రానికి వెళ్లే ముందు తగినంత మంచి నీరు లేదా ఇతర ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
- తప్పకుండా గొడుగు, స్కార్ఫ్, టోపీ వంటివి ఉపయోగించాలి.
- గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, గుండెపోటు/అధిక రక్తపోటు వంటి వివిధ అనారోగ్య సమస్యలు ఉన్న వారు ఉదయం 10 గంటల్లోపు లేదా సాయంత్రం 3 గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా ప్రణాళిక వేసుకోవాలి.

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలే..

సాధారణ ఎన్నికల్లో పోలింగ్ కేం**ద్రం లేదా** పోలింగ్ సంబంధిత స్థలంలో బలవంతంగా బ్యాలెట్ పేపర్లు, ఓటింగ్ యంత్రాలను చేజిక్కించుకుని స్వాభావిక ఓటింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగించడాన్ని బూత్ క్యాప్చరింగ్ నేరంగా పరిగణిస్తారు. అలాగే ఓటర్లను తమ ఓటు హక్కును వినియోగించకుండా అడ్డుకోవడం, బెదిరించడం, లెక్కింపు కేంద్రంలో ఓటింగ్ యంత్రాలను ఎత్తుకుపోవడం, ప్రభుత్వ ఉద్యోగి ఈ పనులను ప్రోత్సహించినా, ఒక అభ్యర్థి గెలుపు కోసం ప్రయత్నించినా కాగ్నిజబుల్ నేరంగా పరిగణిస్తారు. బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడిన వ్యక్తి లేదా వ్యక్తులకు ఏడాది నుంచి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడుతుంది. ప్రభుత్వ ఉద్యోగి బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడుతుంది.

ఓటర్లను తరలించడం నేరమే...



పోలింగ్ రోజున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలించడం కూడా ఎన్నికల నియమావళి ప్రకారం నేరమే. పోలింగ్ రోజున దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై తరలించి ఓటు తమకు అనుకూలంగా వేయించుకోవాలని ప్రయత్నిస్తారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు వేయడానికి రావాలే తప్ప ప్రలోభాలకు గురి చేయరాదు. ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అధికారులు కేసు నమోదుచేస్తారు.

పోలింగ్ కేంద్రంలోకి వీరికే అనుమతి



- ప్రిసైడింగ్ అధికారి ఒకసారి ఎంత మంది ఓటర్లను పోలింగ్ బూత్‌లోకి అనుమతిస్తే వారు మాత్రమే లోపలికి రావాల్సి ఉంటుంది.
- పోలింగ్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుంది.
- ఎన్నికల సంఘం అనుమతించిన వ్యక్తులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లవచ్చు.
- అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు సంబంధిత గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించవచ్చు.
- ఓటేయడానికి వచ్చినవారి పిల్లలు, అంధులు, వృద్ధులకు తోడుగా వచ్చినవారు, లేదంటే ఎన్నికల అధికారి సూచించిన సహాయకులు..
- రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేక పరిస్థితుల్లో నియమించిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ రోజు కేంద్రంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది.
- పై నిబంధనలు అతిక్రమించిన వారిపై అధికారులు చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.